మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా చూడాలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మార్చి 26 : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. 64 సెంటర్లల్లో బుధవారం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 12,579 మందికిగాను 12,553 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తాగునీరు, టాయిలెట్స్, మెడికల్ సదుపాయాలు కల్పించాలని అన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

మాచారెడ్డి, మార్చి 26 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో తప్పుడు ఓనర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి రిజ్వానాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అజీజ్ బుధవారం కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రిజ్వాన బేగం గ్రామ పంచాయతీ లెటర్‌పై తప్పుడు ఇంటి నంబర్లు వేస్తూ ఓనర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలు ప్లాట్లుగా మార్చేందుకు సహకరిస్తున్నారని, ఓనర్‌షిప్‌లో వేసిన ఇంటినంబర్‌కు సంబంధించిన ఇల్లు లేదని, ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించడంతో మాచారెడ్డి ఊరచెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటచే విచారణ చేపట్టి కబ్జాకు గురైన శిఖం భూమిని స్వాధీనం చేసుకొని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి, మార్చి 26 : జిల్లా కేంద్రంలో నీట్, ఎంసెట్ కోచింగ్ సెంటర్ల పేరుతో అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా నడుపుతున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులూ, విషయ పరిజ్ఞానం లేని నిపుణులతో నడిపిస్తూ విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని, కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ ఇన్నోవేషన్ ఇనిస్టిట్యూట్‌గా ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాల

కామారెడ్డి, మార్చి 26 : పట్టణానికి చెందిన ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలను హోస్ట్ ఇనిస్టిట్యూట్‌గా గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని టీహబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డికి టీజీఐసీ సీఈవో మిరాజ్ చేతుల మీదుగా హోస్ట్ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ భాస్కర్ రావు, డీన్ నవీన్ కుమార్, కో ఆర్డినేటర్ దత్తాత్రి, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి, టీపీవో బాలు మహేంద్ర పాల్గొన్నారు.

దుఃఖంలోనూ పరీక్ష రాసి

గుండెపోటుతో తండ్రి మృతి

కీర్తన

భిక్కనూరు, మార్చి 26 : తండ్రి మృతి చెందగా.. ఆ బాధను దిగమింగి కూతురు పదో తరగతి పరీక్షకు హాజరైంది. భిక్కనూరుకు చెందిన బీబీపేట సత్యం(42) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన కూతురు కీర్తన బోరున విలపించింది. కీర్తన మండలంలోని జంగంపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. పరీక్ష రాసిన అనంతరం తండ్రి అంత్యక్రియలకు బయల్దేరింది. సత్యంకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సత్యం మృతిపై మండల విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

నిందితులకు జైలు శిక్ష, జరిమానా

కామారెడ్డి, మార్చి 26 : ఓ వివాహితను వేధించి ఆమె మృతికి కారణమైన నిందితులకు కోర్టు జైలు శిక్షతోపాటు రూ. మూడు వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పెద్దమల్లారెడ్డికి చెందిన బొజ్జ దివ్య అదేగ్రామానికి చెందిన రమేశ్‌తో ప్రేమ వివాహం చేసుకున్నది. అయితే అక్రమ సంబంధం పెట్టుకున్నదని ఆమె చిన్న మామ, వేరే వ్యక్తి వేధిస్తున్నాడని 2023 జూలై 10వ తేదీ సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నది. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లేలోపు మృతి చెందింది. మృతురాలి సోదరుడు పరశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దివ్య మృతికి కారణమైన బొజ్జ చిన్న బాలయ్య, సింగిలి వంశీలపై నేరము రుజువైనందునా వీరికి సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్ జడ్జి సుమలత మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ.మూడు వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న పోచారం

బాన్సువాడ రూరల్, మార్చి 26 : మండలంలోని దేశాయిపేట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. బుధవారం ఆయన స్వగ్రామం రాంపూర్ తండా గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అంబర్‌సింగ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట తండా పెద్దలు హరిసింగ్, గోప్యానాయక్, మోహన్ నాయక్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బాన్సువాడ, మార్చి 26 : బాన్సువాడలో ఏటా నిర్వహించే హనుమాన్ దీక్ష స్వాముల మహా మండల పూజ కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హనుమాన్ స్వాములతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నల్లపోచమ్మ ఆలయం గౌరవ అధ్యక్షుడు హనమంత్‌రావు టేల్, ఆలయ ప్రధాన అర్చకుడు కాశీ సంతోష్ శర్మ తదితరులు ఉన్నారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట, మార్చి 26 : జిల్లా వ్యాప్తంగా అక్రమ వడ్డీ వ్యాపారులపై బుధవారం ఆకస్మికంగా స్పెషల్ రైడ్స్ నిర్వహించామని ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 69 రైడ్స్ నిర్వహించి 16 కేసులు నమోదు చేసి డాక్యుమెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కామారెడ్డి సబ్ డివిజన్‌లో 42 రైడ్స్, 8 కేసులు, ఎల్లారెడ్డి సబ్ డివిజన్‌లో 12 రైడ్స్, 5 కేసులు, బాన్సువాడ సబ్ డివిజన్‌లో 15 రైడ్స్, 3 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అక్రమ వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి కేంద్రాలపై పోలీసులు దాడులు, తనిఖీలు నిర్వహించి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వ్యాపారులు చేస్తున్న ఆర్థిక మోసాలను తట్టుకోలేక ఎంతో మంది బాధితులు కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎల్లారెడ్డి మండలంలోని వడ్డీ, చీటీల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి ఇండ్లలో సోదాలు నిర్వహించినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఎనిమిది ఇండ్లకు వెళ్లి సోదాలు చేయగా నలుగురి ఇండ్లలో వివిధ పత్రాలు లభించాయి. పట్టణంలోని శేఖరప్ప ఇంట్లో 99 ప్రామిసరీ నోట్లు, నాలుగు చెక్కులు, మూడు అగ్రిమెంట్లు, జాడె సూర్యప్రకాశ్ ఇంట్లో 16 చెక్కులు, పంతంగి శ్రీనివాస్ నుంచి ఏడు ప్రామిసరీ నోట్లు, రూ.లక్ష నగదు, ఒక అగ్రిమెంట్ పత్రం, హాజీపూర్ తండాకు చెందిన లూనావత్ లాలు ఇంట్లో ఎనిమిది ప్రామిసరీ నోట్లు, మూడు అగ్రిమెంట్లు లభించాయన్నారు. ప్రామిసరీ నోట్లు దొరికిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లింగంపేటకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి కొత్త సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జక్కని బాబా, కౌడ రవి, పారిపల్లి సంతోష్, కొత్త సంతోష్ ఇండ్లలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కొత్త సంతోష్ వద్ద అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చినట్లు గుర్తించామని, నాలుగు రిజిస్టర్ డాక్యుమెంట్లు, తనఖా పెట్టిన బంగారంతోపాటు రూ.90వేల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎల్లారెడ్డి పట్టణంలో వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి ఇండ్లలో సోదాలు చేస్తున్న ఎస్సై మహేశ్

పెద్ద చెరువు కట్టకు మహర్దశ

- ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల తొలగింపు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

చెరువు కట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి

ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత చెరువు కట్ట

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

కామారెడ్డి,మార్చి 26 : జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు కట్టను మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చెరువు కట్టపై చెత్త' శీర్షికన ఈ నెల 10వ తేదీన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్వయంగా చెరువు కట్టపైకి వెళ్లి కార్మికులతో ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పెద్ద చెరువు కట్టపై ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడూ చెరువు కట్టను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇక్కడ ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వస్తుంటారని, ఎవరైన మద్యం తాగినా, సీసాలు పగులగొట్టినా చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసుల అదుపులో ఏఆర్ కానిస్టేబుల్

భిక్కనూరు, మార్చి 26 : మండల కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జేపీ సంతోష్‌గౌడ్ ఈ నెల 12న మద్యం మత్తులో తన తమ్ముడి ఇంటిపై దాడి చేసి అడ్డు వచ్చిన తమ్ముడి భార్యపై చేయి చేసుకొని, అసభ్యకరంగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేశారు. కాగా పోలీసులు బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఇటీవల ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సంతోష్ గౌడ్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు

నస్రుల్లాబాద్, మార్చి 26 : మండలంలోని దుర్కి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు లభించిందని సీహెచ్‌వో రవీందర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఆన్‌లైన్ వేదికగా ఎన్‌క్యూఏఎస్ బృందం, వైద్య సేవలు, రికార్డులను పరిశీలించి 99.09శాతం స్కోర్‌తో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి గిరీశ్, శ్రీలేఖ, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్‌ఎంలు రేఖ, ఉమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నస్రుల్లాబాద్, మార్చి 26 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో భానుప్రకాశ్ బుధవారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈ గోపీనాథ్, కార్యదర్శి గురునాథ్, నాయకులు శ్రీనివాస్, రాజు, వీరప్ప తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు ఎంపిక

కామారెడ్డి, మార్చి 26 : వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి ఉత్సవాలకు ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన అంజలి, హర్షిని ఎంపికైనట్లు కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ ఉత్సవ్-2025 లో భాగంగా రెండు రోజులు నిర్వహించే జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి, మార్చి 26 : టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డైరీని జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

మాచారెడ్డి, మార్చి 26 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ లోని తైబజార్‌కు గురువారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రిజ్వాన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో రూ.15 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని సూచించారు.

రూ. 6.75 లక్షలకు తైబజార్ వేలం

లింగంపేట, మార్చి 26: లింగంపేట మేజర్ గ్రామ పంచాయతీ తైబజార్ వేలం రూ.6లక్షల 75 వేలకు నిర్వహించిన ట్లు గ్రామకార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం వేలం నిర్వహించామన్నారు. ఆరుగురు వ్యాపారులు పోటీ పడగా, ఎల్లారెడ్డికి చెందిన ముజీబ్ రూ.6.75 లక్షలకు కైవ సం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దడువాయి వేలానికి ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్ ఉన్నారు.

'నవోదయ'కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

లింగంపేట, మార్చి26: మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన అట్టెం మనోజ్, లింగంపేటకు చెందిన సూర్ణ విరాట్ యాదవ్ జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. జనవరిలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అట్టెం మనోజ్ యాదవ్ శెట్పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, లింగంపేటకు చెందిన సూర్ణ విరాట్ యాదవ్ సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రభుస్వామి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

ప్రభుస్వామి ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

లింగంపేట, మార్చి26: మండలంలోని అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయ ఉత్సవాల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదబ్రాహ్మణుల తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఎడ్ల బండ్ల ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Banswada Branch, Dist. Kamareddy** agreed to accord Loan to **Apasiwar Ramulu** S/o Apasiwar Siddiram, Age 43 Yrs, Occ:Business, R/o H.No.1-07, Pedda Edgi (V) Jukkal (M), Kamareddy (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(03) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the RCC Roofed House (Ground Floor) bearing G.P.H.No.2-78/10/B/2 along with Open Place lies in Sy No.19/C (Before NALA) (Sy No.19/C/1/1 After NALA) **admeasuring total plot area 1089 Sq.Yds equal to 910.87 Sq.Mtrs, out of which RCC Roofed Plinth area 704.00 Sq.fts**, situated at Jukkal Village and Jukkal Mandal Kamareddy District, within the limits of Gram Panchayat Jukkal, under the jurisdiction of Regn.Sub Dist Bichkunda and Dist.Regn.Nizamabad. **Bounded as below :** East: Jukkal – Edgi Road,West:Government Land ,North: Land of Vaidynath S/o Khandu, South:Land of Raghunath S/o Khandu

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

రామారెడ్డి (సదాశివనగర్), మార్చి26: ఎండలు ముదరడంతో ఉపాధి హామీ కూలీలు, గ్రామ పంచాయతీ వర్కర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం లోపల పనులు పూర్తి చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్మా సూచించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో బుధవారం వివిధ గ్రామాల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ కార్యకర్తల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని , వాటిని వర్క్ సైట్ దగ్గర ఉపాధి కూలీల కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కోసం ప్రజల పడిగాపులు

- అందుబాటులో లేని అధికారులు
- రైతులపై దురుసుగా ప్రవర్తించిన సిబ్బంది

తహసీల్ కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీలు

కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

లింగంపేట, మార్చి 26: రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన అధికారులు కార్యాలయాన్ని అటెండర్లకు అప్పగించి వెళ్లిన ఘటన లింగంపేట తహసీల్ కార్యాలయంలో చోటు చేసుకొన్నది. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులు, బ్యాంకు అధికారులు వేచి ఉండి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తహసీల్ కార్యాలయానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, బ్యాంకు అధికారులు, మహిళలు భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు వివిధ పనుల కోసం వచ్చారు. ఉదయం వచ్చిన అధికారులు మధ్యాహ్నం వరకు ఉండి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లిన అధికారులు సాయంత్రం నాలుగు గంటల వరకు తిరిగి రాలేదు. అధికారులు అందుబాటులో లేక రైతులు ఆరుబయట వేచి ఉండాల్సి వచ్చింది. అధికారులు ఎప్పుడు వస్తారో కనుక్కోవాలని అందుబాటులో ఉన్న సిబ్బందిని విచారించగా ఫీల్డులో ఉన్నారని సమాధానం చెప్పారని వెల్లడించారు. ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన విందులో పాల్గొనడానికి వెళ్లిన అధికారులు సాయంత్రం వరకు రాలేదని ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ సిద్ధిరాంరెడ్డి, మోతె గ్రామానికి చెందిన రైతు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సి అధికారులు కార్యాలయాన్ని వదిలివెళ్లడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్ సైతం అందుబాటులో లేకుండా పోయారు. ఈ విషయమై తహసీల్దార్ సురేశ్‌ను వివరణ కోరగా ఆన్‌లైన్ సర్వర్ డౌన్ కారణంగా మధ్యాహ్నం 2.45 గంటలకు ఫీల్డుకు వెళ్లినట్లు తెలిపారు. తాను ఎక్కడా విందుకు వెళ్లలేదన్నారు. ఫీల్డుకు వచ్చిన అనంతరం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు క్లియర్ చేసినట్లు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ ఎస్సెస్సీ పరీక్షల ఫ్లయింగ్ స్క్వాడ్ డ్యూటీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల



ఆశయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట, మార్చి 26: మండలంలోని శివ్వాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకొన్నది. లింగంపేట్ మండలం మాలపాటి గ్రా మానికి చెందిన మాజీ సర్పంచ్ ఆశయ్య (45) ఎల్లారెడ్డి పట్టణానికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం బైక్‌పై రాత్రి సమయంలో గ్రామానికి బయలు దేరాడు. మండల పరిధిలోని శివ్వాపూర్ గ్రామ సమీపంలోని రైస్ మిల్ వద్దకు చేరుకున్న తరుణంలో సైకిల్‌పై వస్తున్న ఓ వ్యక్తిని ఆశయ్య తన బైక్‌తో ఢీకొట్టాడు. ఆశయ్య తలకు బలమైన గాయం కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి, అటునుంచి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆశయ్య మృతిచెందాడు. ఆశయ్య అంత్యక్రియలను మాటపాటి గ్రామంలో నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశయ్యకు భార్య సిద్ధవ్వతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆశయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆశయ్య మృతిపై ఆయన తీవ్ర దిగ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



ఆశయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నిజమైన కార్మికులు
లేబర్ కార్డులు తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 26: నిజమైన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులందరూ కార్మిక లేబర్ కార్డులు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారందయన మాట్లాడుతూ.. సంఘంలోని 12 రంగాల కార్మికులకు వివాహ బహుమతి, ప్రసూతి వైద్య, ప్రమాద మరణ బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. కార్మిక లేబర్ కార్డు లేని వారు వచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు దీనిపై కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. సంఘం నాయకులు దుర్గాసింగ్ లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

సబ్జెక్టు మీద పట్టుంటే
ఉద్యోగం సాధించడం సులువు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 26: సబ్జెక్టు మీద అవగాహన, నైపుణ్యం ఉంటే ఉద్యోగాలు సాధించడం ఎంతో సులువని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసీ, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. ఎంఎస్‌ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు నిర్వహించిన జాబ్‌మేళాకు ఎల్లారెడ్డితో పాటు పరిసర ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. అభ్యర్థులకు సంస్థ ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, మోహన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఫలితాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త శంకరయ్య, అధ్యాపకులు అరుణ్‌కుమార్, శశిధర్, చంద్రకాంత్, దశరథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

బ్రహ్మాజివాడిలో గ్రామసభ

లింగంపేట(తాడ్వాయి), మార్చి26: తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజివాడి గ్రామంలో అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎడమ కాలువకు సంబంధించి భూసేకరణ నిమిత్తం అధికారులు గ్రామసభ నిర్వహించారు. కాలువ విషయమై గ్రామ రైతులతో చర్చించారు. వారినుంచి అధికారులు సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహసీల్దార్ రహీమొద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నిజాంసాగర్ , మార్చి 26 : బులేరో వాహనం బైక్‌ను ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మంగ్లూర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకున్నది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగ్లూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి నంబర్ 161 పై బులేరో వాహనం డ్రైవర్ వాహనాన్ని రాంగ్ రూట్‌లో అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒక బైక్‌కు ఢీకొట్టాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న విజయలక్ష్మి అనే మహిళ చనిపోయింది. ఆమె తండ్రి సాయిలుకు గాయాలయ్యాయి. బాధితుల బంధువు కేశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, మార్చి26: మండలంలోని పోచారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో ప్రభాకర్ పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. గ్రామ శివారులో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను తనిఖీ చేశారు. పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి తిరుపతి తదితరులు ఉన్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ

లింగంపేట(తాడ్వాయి) మార్చి 26: తాడ్వాయి తహసీల్ కార్యాలయాన్ని కామారెడ్డి ఆర్డీవో వీణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ వివరాలు, రికార్డు గది, కంప్యూటర్ గది పరిశీలించారు. పెండింగ్ ఫైల్స్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటిసారి కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ మీటర్‌లో నాగుపాము కలకలం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 26: నాగుపాము విద్యుత్ మీటర్‌లో దూరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఘటన బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో జరిగింది. నిజాంసాగర్ రోడ్డులో ఉన్న మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన సాయిబాబా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లోని విద్యుత్ మీటర్‌లో దూరిన నాగుపాము బుసలు కొట్టడంతో చూసిన సర్వీసింగ్ సెంటర్ యజమాని, చుట్టుపక్కల దుకాణాదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సర్వీసు వైరు వచ్చే రంధ్రం గుండా మీటర్‌లోకి దూరిన పాము ప్రజల సందడి పెరగడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఎంఈవోకు సన్మానం

నాగిరెడ్డిపేట, మార్చి 26: ఎల్లారెడ్డి ఎంఈవోగా పని చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న వెంకటేశం దంపతులను బుధవారం నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయరాజ్, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, రిటైర్డ్ ఎంఈవో గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు నమోదు

లింగంపేట, మార్చి26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట స్థానిక పోలీసులు ఏఎస్ఐ ప్రకాశ్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు పరిశీలించి వెంటనే చెల్లించాలని సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది కాశాగౌడ్, జువ్వి నాయక్, జయ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.